పరివర్తనము

★ శ్రీ భాస్కర్ల కృష్ణారావు ★

'రాధా! నా పౌంటెన్ కలం ఎవరు పాడుచేశారు యిల్లా?'

'.................'

'రాధా!'

'ఆఁ! వొస్తున్నా'

భర్త తీవ్రమైన అరుపులకి కారణం తెలియక కొంచెం కళవళపాటుతో నారాయణరావుగారి గదిలో ప్రవేశించింది రాధ. భార్య గది గుమ్మంలోకి రాగానే వొళ్లుతెలియని వీరావేశంలో మళ్లీ అదే వరసని అందుకున్నాడు నారాయణరావు.

'నీకోసం ఎన్నిసార్లని అరవాలి?'

'పెరట్లో కప్పులు కడుగుతున్నానండీ—పనితొందరలో మీ పిలుపు వినపడలేదు.'

'నీకు మరీ పరాకు ఎక్కువఅయింది. పిలుస్తుంటే మనిషిని కాననుకున్నావా? ఈ కలం ఎవరు పాడుచేశారు యిల్లా?'

'ఏమోనండీ, నాకేం తెలియదు, ఉదయంమాత్రం పిల్లలు ఈ గదిలో ఆడుకుంటూవుండగా చూశాను.'

'ఉదయం పిల్లలు ఎక్కడ ఆడుకున్నది నిన్నడగటంలేదు. ఈ కలం ఎవరు పాడుచేశారని నిన్నడగటం'

'పిల్లలు ఏమైనా తీశారేమో కనుక్కున్నారా?'

పైవాక్యం వెలువడిందే తడవుగా నారాయణరావు గదంతా 'సుసీ', 'సుసీ' అన్న కేకలతో నిండిపోయింది.

సుసి మరుక్షణమే నాన్నగారి కోపానికి కారణం తెలియక బేలమొహంతో గదిలో ప్రవేశించింది.

'నా గదిలో అల్లరిచెయ్యొద్దని మీకు ఎన్నిసార్లు చెప్పాను?'

నాన్నగారి పై ప్రశ్నకి సుసి కళ్లల్లో అమాంతంగా నీళ్లుతిరిగాయి. జవాబు చెప్పటానికి నోటిమాట పెకల్లేదు. ఎండిపోయిన చిరుపెదిమెల్ని నాలిక చివరతో తడుపుతూ, నిశ్చేష్టురాలై జవాబుగా కళ్లు నులుపుకోవటం మొదలెట్టింది సుసి.

'ఈ కలం నువ్వు తీశావా?'

లేదన్నట్లు తలూపింది...

'తమ్ముడేమైనా తీశాడా?'

జవాబులేదు...

'జవాబు చెప్పవేఁ?'

సుసి ఈమారుకూడా జవాబు చెప్పలేకపోయింది...

సుసి మౌనానికి నారాయణరావు ఉగ్రుడైపోయినాడు. కళ్లెర్రజేసి, ఒళ్లుతెలియకుండా ఆ అమ్మాయిని సమీపించి ఆ గదిలో వొహమూలకి వున్న చేతిబెత్తాన్ని అందుకొని బాదటం మొదలెట్టాడు. సుసి కిక్కురుమనకుండా, పొంగి పొర్లుతూ వొస్తూవున్న దుఃఖాన్ని దిగమ్రింగి 'కలం నేను తీయలేదు - నాన్నా కలం నేను తీయలేదు' అన్న అమాయకపు అరుపులతో ఆ అత్యాచారాన్ని సహించింది.

'తమ్ముడేడీ?'

రెండునిమిషాల తరవాత అడుగులో అడుగు వేసుకుంటూ, ముకుళించిన మొహంతో మూడేళ్ళ కూన 'మురళి' నగ్నంగా గదిలోకి ప్రవేశించాడు.

'ఈ కలం నీవు తీసావా?'

అవునన్నట్లు తలూపాడు. పసిపిల్లలకి అబద్ధాలాడటం తెలియదు. వాళ్ళకి అజీర్ణవొస్తువలకి మళ్లే అసత్యంకూడా వొంటబట్టదు. నారాయణరావు తన కోపం ఆసాంతం ఇంతకుముందే సుసిపైన తీర్చుకున్నాడు. పడకకుర్చీలో పడుకున్నపాటుని ఆ కలాన్నే పుచ్చుకుని విసిరికొట్టాడు మురళి మొహంమీద.

మురళి సుసికి మళ్లే దుఃఖాన్ని దిగమ్రింగటం తెలియక బోరుమని ఏడుస్తూ గదిలోంచి వెళ్ళిపోయినాడు.

* * *

నారాయణరావు ప్రథమ కళత్రం- ఈ లోకాన్ని విడిచి షుమారు మూడుసంవత్సరాలయింది. కమలను నారాయణరావు ఆమె బ్రతికివుండగా అమితంగా ప్రేమించాడు. ఆ రోజుల్లో 'ఆమెతోడిదే ఈ లోకమన్నట్లు' నడుచుకోవటంవల్ల నారాయణరావు భార్యావిధేయుడనికూడా ప్రజల్లో ప్రతీతి అయింది.

మొదటిభార్య ఈ లోకాన్ని విడిచిందే తడవుగా నారాయణరావుకు సంబంధాలు రావటం మొదలెట్టాయి. కమల ప్రేమని అంత తొందరలో మరిచి, మళ్లీ వివాహానికి సిద్ధపడటమంటే అతనికి మొదట్లో మనస్కరించలేదు. పిన్నవయసులో వున్న నారాయణరావు, తనకోసం కాకపోయినా, పసిపిల్లలకోసమైనా మళ్లీ వివాహం చేసుకోవటం శ్రేయస్కరమని బంధువులంతా సలహాయిచ్చారు. నారాయణరావుకు కొంతవరకు వాళ్ల సలహా న్యాయసమ్మతంగానే గోచరించింది. వొంటరిగా పిల్లలతో కాపురంచేయటమంటే కష్టసాధ్యంగానే కనపడింది.

ఈ విషయాలన్నీ నారాయణరావు మనస్సుని బాగా కలతపెట్టాయి. పిల్లల బాగోగుల్నిబట్టి వివాహం చేసుకోవటమే అతనికి అప్పట్లో విద్యుక్తంగా కనపడింది. తత్ఫలితంగా చివరకి రాధని పరిణయమాడాడు.

* * *

ఆరోజు రాత్రి నారాయణరావు గదిలోకి పడుకోవటానికి వెళ్లేసరికి పిల్లలు యి[illegible] నిద్రపోకుండా పక్కలమీద కూర్చునే వున్నారు. అంత రాత్రిదాకా పడుకోనందుకు కొంచెం విసిగి, పడుకొమ్మని పిల్లల్ని మందలించి, తనపక్క సమీపించాడు నారాయణరావు. వెళ్లి పక్కమీద మేనువాల్చిందే తడవుగా అతనికి సుఖంగా నిద్రపట్టింది.

రాత్రి పన్నెండింటికి గావును నారాయణరావుకు మళ్లీ మెళుకువ వొచ్చింది. నిద్రమాంద్యంవల్ల ఎంతరాత్రి అయిందో అతనికి తెలియలేదు. కిటికీలోంచి బయటికిచూస్తే అర్ధచంద్రుడు వాయువేగంగా మబ్బులోంచి పరుగెత్తుతూవున్నట్టు అతనికి కనపడింది. నెమ్మదిగా కదిలి, తనమీదవున్న రాధ చేతుల్ని పక్కకు వత్తిగించి, ఎడమపక్కని మళ్లేసరికి పిల్లలు కిక్కురుమనకుండా పక్కలమీద కూర్చునివున్నట్లు పొడకట్టిందాతనికి. రెండునిమిషాలు ఆలోచనారహితంగా వాళ్లవేపు నిదానించి చూచాడు నారాయణరావు.

సుసి తమ్ముడిముందు కూర్చుని మురళికంటికి ఆవిరిపెడుతోవుంది. మొదట్లో మురళీకంట్లో నలుసుయేదో పడివుంటుందనుకున్నాడు నారాయణరావు. కాని వొకనిమిషం తదేకదీక్షగా ఆ కంటివేపు చూచేసరికి కన్ను అమితంగా పొంగినట్లు కనపడిందాతనికి.

'మురళీ! ఏమయిందమ్మా కంటికి?'

నారాయణరావు ధ్వని వినపడగానే సుసి కొంచెంగా వులికిపడి ఏమీతెలియనట్లు పడుకోవటానికి ప్రయత్నించింది. కాని అంతలోకే నారాయణరావు పిల్లల్ని సమీపించి 'భయంలేదులే తల్లీ! లేచి కూర్చో' అని లాలించటంతో సుసి కొంచెం ధైర్యంతెచ్చుకుని మళ్లీ లేచి కూర్చుంది.

నాన్నగారి లాలనకి మురళి అమాంతంగా కళ్లవెంబడి నీళ్లుపెట్టుకున్నాడు. నారాయణరావు దిగులుగా మురళిని వొళ్లోకి తీసుకుని ధోవతి కుచ్చెళ్లతో కన్నీళ్లు తుడిచాడు. మురళి దుఃఖం నాన్నగారి బుజ్జగింపులకి అంతకంతకు మరీ ఎక్కువయింది.

'నాన్నా! ఏమయిందే నీకంటికి?'

మురళికి తన బాధనిగూర్చి తండ్రికి చెప్పుకోవటంకూడా చాతకాలేదు. మురళికి యితరులని అర్థం చేసుకోగల శక్తిమాత్రం కలిగింది గాని తన మనోగతభావాల్ని యితరులకుమాత్రం స్పష్టంగా వ్యక్తపరిచే జ్ఞానం యింకా కలగలేదు. ఆ మాటలురాని పసికూనకి కంటికేదో సెప్పి అయింది అని చెప్పటంకూడా దుర్భరమయింది.

మురళి అవస్థ నారాయణరావుకి సునాయాసంగా వ్యక్తమయింది. మళ్లీ మురళిని ప్రశ్నించటంవల్ల లాభంలేదని తెలుసుకుని 'సుసీ! ఏమయిందమ్మా తమ్ముడి కంటికి' అని పక్కనున్న అమ్మాయిని రెట్టించి అడిగాడు. సుసి మొదట్లో నిజంచెప్పటానికి జంకింది. కాని నారాయణరావు 'భయంలేదులే' అని హామీ యిచ్చేసరికి ఆ లేతహృదయానికి యెక్కడలేని ధైర్యం కలిగింది.

'నాన్నా! పొద్దున్నే, కలంతో నీవు కొట్టలే...'

నారాయణరావుకు అంతా అర్థమయింది. ప్రొద్దుటి దృశ్యం సినిమాకి మల్లే వొక్కమాటు కళ్లముందు తిరిగింది. ఉదయం పిల్లలపట్ల అంత అమానుషంగా, కౄరంగా ప్రవర్తించినందుకు లోలోపల తన్నుతానే నిందించుకున్నాడు. పిల్లలు 'అనాథలకు మల్లే' బ్రతకటంచూచి అతని హృదయం తరుక్కుపోయింది.

'కమలమీది అవ్యాజమైన ప్రేమకి యిద్దా ఫలితం' అన్న వొక్కప్రశ్న ఆతని హృదయాన్ని దహించటం మొదలెట్టింది.

మరుక్షణంలోనే యిద్దరి పిల్లల్ని చెరో చంకని యెత్తుకుని తనపక్కని తిన్నగా చేరుకున్నాడు నారాయణరావు. మళ్లీ అదే ప్రశ్న. హృదయంలో చెప్పరాని బాధ అంకురించింది. ఆ బాధ నివారణానికి అప్పట్లో ఏమిచేయటమో అతనికేమీ తోచలేదు. ఎంతో ఆలోచించాడు. ఏమీ పాలుపోలేదు. చివరకి వొక్కటే వొక్క మార్గం కనపడింది. అప్పట్లో అతనికి అదే యుక్తంగా తోచింది.

అప్రయత్నంగా పిల్లల్ని హృదయానికి గట్టిగా అదుముకున్నాడు. కొంత మనోశాంతి కలిగింది కాని హృదయానికి సంపూర్ణమైన సంతృప్తికాలా. ఆ పసిపిల్లల్ని అంతకంతకు తన హృదయంలో యిముడ్చుకోవటానికి ప్రయత్నంచేశాడు, కాని సాధ్యంకాలా. విఫలమనోరథుడై ఏదో అర్థిస్తున్నవాడికి మల్లే కమలవేపు రెండునిమిషాలవరకు ఏకాగ్రంగా చూచాడు. ఫోటోలోంచి కమల చిరునవ్వు నవ్వినట్లు కనపడిందాతనికి. ఆలోచనరహితంగా, సంతృప్త హృదయంతో వెనుదిరిగిచూచేసరికి రాధ ప్రేమపూర్వకంగా చిరునవ్వునవ్వుతూవున్నట్లు పొడకట్టింది. ఆ చూపులకి గొప్ప అపరాధికి మల్లే బాధపడి పిల్లల్ని మరీ దగ్గరికి తీసుకుని నిండుగా శాలువ కప్పుకున్నాడు నారాయణరావు. నిద్ర యెప్పుడు పట్టిందో, ఏమో అతనికే తెలియదు.——